

# ప్రగతికి సోపానాలు

యన్.యస్.మణ్యం

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటుతోంది. కాంతమ్మ వీధి మొగకేసే చూస్తోంది ఏదైనా జట్కా వస్తోందేమో అని. గుర్నాధంగారు పేపరు చదువుకొంటున్నారు అరుగు మీద కూర్చొని.

"ఇంకా రాలేదే సుబ్బారావు. ఓ సారి మీరు కాలవగట్టు దగ్గరికి వెళ్ళి రాకూడదూ"

"అంతవరకువచ్చినవాడు ఇక్కడికి వచ్చేలోపులో దారి తప్పిపోడులే నీ

సుపుత్రుడు" అన్నాడు గుర్నాధం నవ్వుతూ.

మళ్లా ఆయనే అన్నారు "ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడాలని రాసాడు ఏమిటి అనుకొంటావ్?"

"ఏమో! మీకే తెలియాలి".

"బహుశా మనకి తెలియకుండా ఎవర్నయినా పెళ్ళిచేసుకొన్నాడేమో" అన్నారు గుర్నాధం కొంటెగా.

"నా కొడుకు ఎప్పుడూ అలాటి సిగ్గుమాలిన పనిచెయ్యడు" అంది కాంతమ్మ గర్వంగా.

దూరాన్న జట్కా చప్పుడు విని కాంతమ్మ నించుంది. బండి యింటి ముందర ఆగుతుంటే గుర్నాధంగారు పేపరు క్రింద పడేసి అటువైపే చూసారు.

రెండు పెట్టెలతో సుబ్బారావు, ఇంకో అమ్మాయి దిగారు.

కాంతమ్మ అర్థం కాకుండా గుర్నాధంగారి కేసి చూసింది.

బండివాడికి డబ్బులిచ్చి సుబ్బారావు పరిచయం చేసాడు. "నా స్నేహితురాలు విజయ, అక్కడే హౌస్ సర్జన్ చేస్తోంది. మిమ్మల్ని చూస్తానంటే తీసుకువచ్చాను."

కాంతమ్మ విజయని లోపలికి తీసుకుని వెళ్ళింది. సుబ్బారావు తండ్రి ప్రక్కన కూర్చొంటూ అన్నాడు. "విజయ కమ్మవారి అమ్మాయి, అమ్మకి...."

"మీ అమ్మ అతిధుల్ని బాగానే చూస్తుందిలే ఏకులమయినా." అన్నారు గుర్నాధం.

"నేను రాసిన ఉత్తరం అందిందనుకుంటాను."

తర్వాత మాట్లాడదాములే. ముందు స్నానంచేసి కాస్త ఎంగిలి పడండి. నేను యిప్పుడే పొలం వెళ్ళివస్తా. కాస్త పనుంది" అంటూ అక్కడ నుంచి కదిలారు గుర్నాధం.

సుబ్బారావు నూతి దగ్గర స్నానం చేస్తుంటే, కాంతమ్మ విజయకి కాఫీ యిస్తూ అంది.

"ఏమమ్మా మీ దేవూరు"

"మాది దొండపాడు అండి. గుడివాడ దగ్గర. నాన్నగారు దొండపాడులో వ్యవసాయం చేస్తున్నారు. అమ్మ చిన్నప్పుడే పోయింది" అంది విజయ.

కాంతమ్మ విజయకేసి పరీక్షగా చూసింది. రంగు చామనఛాయ అయినా ఆకర్షణీయమైన మొహం. చక్కటి ఉచ్చారణ, గులాబిరంగు చీర, అదే రంగు జాకెట్టు, మెళ్ళో సన్నటి గొలుసు, చాలా నిరాడంబరంగా ఉంది విజయ.

వాళ్ళిద్దరూ అలా కబుర్లు చెప్పుకొంటుంటే సుబ్బారావు డ్రెస్ అయి తల దువ్వుకుంటున్నాడు.

కాంతమ్మ అందరికి భోజనాలకి ఏర్పాట్లు చెయ్యడానికి సిద్ధపడుంటే, వంటింటిలోంచి విజయ సుబ్బారావు దగ్గరికి వచ్చింది.

"మీ అమ్మగారు చాలా సోషల్‌గా

ఉన్నారు. నేను కమ్మవాళ్ల అమ్మాయి నని చెప్పినానసరే" అంది వి జ య నవ్వుతూ.

"మా అమ్మ ఆతిధ్యానికి ఏమీ లోటు చెయ్యదు. కాని అతిధులు ఆత్మీయుల మవుదామను కొన్నప్పుడే వస్తుంది తంటా" అన్నాడు సుబ్బారావు కూడా నవ్వుతూ.

ఇంతలో గుర్నాధంగారు కూడ వచ్చారు పొలం నుంచి. "నేను మీతో కూర్చుంటా. మగవాళ్ళకి పెట్టేయండి" అంది విజయ.

"ఎందుకమ్మా ముగ్గురికి వడ్డించేస్తా. నేను తర్వాత తి ం టా లే" అంది కాంతమ్మ.

"ఆవిడకి తను భోజనం చేసేటప్పుడు మనలాంటి అనాచారులు చుట్టూ ఉండడం యిష్టం ఉండదులే అమ్మా" అన్నారు గుర్నాధం నవ్వుతూ.

"నా మడీ ఆచారాలు మిమ్మల్నెపుడూ బాధించలేదుగా, ఈ పద్ధతిలో నే ఈ ఘటాన్ని పోసీయండి." అంది కాంతమ్మ కూడ నవ్వుతూ.

ముగ్గురూ భోజనాలకి కూర్చొన్నారు. గుర్నాధంగారు సుబ్బారావు పనిచేస్తున్న ఫ్యాక్టరీ కంపెనీ గురించి ఏవో ప్రశ్నలు వేస్తున్నారు. యేదో ఆలోచిస్తున్న సుబ్బారావు సరీగా జవాబులు చెప్పకపోతుంటే విజయ సర్ది చెబుతోంది.

భోజనాలు అయిన తర్వాత సుబ్బారావు వి జ య లు బయట గదిలో మాటాడుకొంటుంటే "వక్కపొడి ఎక్కడ పెట్టావే కనబడడం లేదు" అంటూ వంటింటిలోకి వచ్చారు గుర్నాధం.

వంటగది సర్దుతున్న కాంతమ్మ ఆయన్ని దగ్గరికిపిలిచి అంది 'వాడితో మాట్లాడేరా"

"ఏదీ ఇప్పుడేగా భో జ న ం అయింది. విశ్రాంతి తీసికొంటున్నారు. సాయంత్రం మాట్లాడతానులే. పైగా ఆ అమ్మాయి ఎదురుగా ఉంటే వాడితో ఏ విషయం ఎలా మాటాడతాను"

"అసలు ఆ అమ్మాయిని ఎందుకు తీసికొని వచ్చినట్టు" అంది కాంతమ్మ.

"ఏమో నాకెలా తె లు స్తు ం ది. బహుశా స్నేహితురాలేమో. నిజంగా ఈ ఊరు చూడటానికే వచ్చిందేమో. మనం ఊరికే తేలిపోతే అ బ్బా యి దృష్టిలో తేలికయిపోతాం. పైగా ఇద్దరూ బాగా చదువుకున్నవాళ్ళు. కాన కలివిడిగా ఉంటారు. ఈ రోజుల్లో కుర్రకారు మనచిన్నప్పటిలా కాదుగా" అన్నారు గుర్నాధం నవ్వుతూ.

అదికాదండీ. నాకు ఏదో అనుమానంగా ఉంది. ఒకవేళ వాడు ఆ అమ్మాయిని పెళ్లాడుతానంటే."

"ఏ విషయం వాడి నోటి నుంచి బయటపడేవరకు నేను ఆలోచించ దలుచుకోలేదు."

"సరె ! వాడిని ఓసారి ఇలా పంపండి. నేనే మాటాడతాను. అన్నట్టు వక్కపొడి కొట్టో గదిలో అలమా

రులో ఉంది" అంది కాంతమ్మ కొంచెం కోపంగా.

"ఏం అమ్మా పిలిచావుటగా." అంటూ వచ్చాడు సుబ్బారావు.

"ఏరా! ఆ అమ్మాయి...."అంటూ అవిడ యేదో అనబోతుంటే,

"మంచి కలివిడి అయినఅమ్మాయి కదూ - లక్షాధికారి కూతురయినా యే మాత్రం గర్వంలేదు. మన కోనసీమ కొబ్బరికాయల రుచి చూపించాలని తీసుకువచ్చా" అన్నాడు సుబ్బారావు.

"అది కాదురా. అసలు నీఉత్తరం.." అంటుంటే.

"ఇప్పుడే వస్తా"నంటూ అక్కడ నుంచి వెళ్ళిపోయాడు సుబ్బారావు.

సుబ్బారావు వంటింట్లోంచి రావడం చూసి గుర్నాధంగారు అక్కడికి వచ్చారు.

"ఏమంటాడు నీ సుపుత్రుడు."

"నేను అనుమానించినంతా నిజమయ్యేలా ఉంది. ఆ అమ్మాయిని గురించి అడగబోతుంటే తప్పించుకొని వెళ్ళిపోయాడు. ఏమండీ! యిప్పుడు యేం చెయ్యడం...." అంది కాంతమ్మ దిగాలుగా.

"పోనీ వాణ్ని పిలవనా. ఇద్దరం యే విషయం తేల్చేద్దాం" అన్నారు గుర్నాధం.

కాస్త ఆ అమ్మాయికి అనుమానం మాత్రం రాకుండా పిలవండి."

ఆయన వీధిగదిలోకి వచ్చేటప్పటికి సుబ్బారావు విజయలు బయటికి వెళ్తున్నారు. వెళ్తూ సుబ్బారావు అన్నాడు ఆయనతో "మన పొలం చూస్తానంటోంది విజయ అలా త్రిప్పి తీసికొనివస్తా."

"సరే! ఇద్దరు షికారుకి వెళ్లారు" అన్నారు గుర్నాధం వంటింటి గుమ్మం దగ్గర కూలబడుతూ.

"ఎంత అప్రతిష్ట. ఊళ్లో వాళ్ళు యేమనుకుంటారు. పెళ్ళికాని పిల్లలు అలా ఊరంబడి తిరగడమే. ఇదేదో విశాఖపట్టణం అనుకొన్నారా? అయినా మీరెలా వెళ్ళనిచ్చారండీ" అంది కాంతమ్మ కోపంగా.

"నా అనుమతి తీసికొంటే గదా. నేను వీధి గదిలోకి వెళ్ళేటప్పటికే వాళ్లు బయలుదేరారు."

"యేమయినా మీరు గట్టిగా చెప్పాలి. ఇలాటి అప్రాచ్యపు పనులు నా ఇంట్లో జరగడానికి వీల్లేదు".

"యేం చేస్తామే. మనకి యెటు చూసినా వీడొక్కడే, చిన్నప్పటినుంచి అల్లారుముద్దుగా పెంచాం. వాడు కూడ ఎప్పుడూ మన మాట కాదనలేదు యింతవరకు, అలాటిది వాడితో పరుషంగా మాటాడాలంటే నాకు నోరు రావడంలేదు" అన్నారు గుర్నాధం.

"అలా అని ఊరుకుంటే ఎలాగండీ! మా తాత చైనం చేసాడు. మా నాన్న యజ్ఞం చేశాడు. మీరిలా కాస్త మారినా మామయ్య, అత్తలు బ్రతికున్న రోజుల్లో ఎంత మడీ, ఆచా

రంలో ఉండేవారూ, ఇలాటి వంశంలో పుట్టినవాడు ఇంకో కులం అమ్మాయిని చేసికొంటే యింకేమయినా ఉందా? నేను యే మాత్రం సహించలేను. మీకు చేతకాకపోతే నేనయినా చెప్తాను మీ రెళ్ళి వాణ్ణి యింటికి పంపండి." అంది కోపంగా కాంతమ్మ.

గుర్నాధంగారు పొలంకేసి బయలు దేరారు.

"విజయ! ఇంతవరకు వచ్చినా నాకేదో భయంగా ఉంది. మా వాళ్ళని ఒప్పించగలనా అని" అన్నాడు సుబ్బారావు మామిడిచెట్ల నీడలో కూర్చున్న విజయతో, చేతిలో ఉన్న కేమెరాని సరిచేస్తూ. "చూడండి. మన విషయం ఎప్పటికయినా మీ వాళ్ళకి తెలియాల్సిందే. అది ఉత్తరాల్లో రాసే బదులు ముఖాముఖీని చర్చించుకోవడం ఉత్తమం." అని కాసేపు ఆగి "ఒక్క విషయం మళ్ళా అడుగుతున్నా. నన్ను మీరు మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నారా" అంది విజయ.

సుబ్బారావు చలించిపోయాడు .... విజయ చేతిని నొక్కుతూ "నీకు యింకా అనుమానం ఎందుకు. నా కోసం మీ నాన్నతో నువ్వు తెగ తెంపులు చేసికొన్న తర్వాత మా వాళ్ళ కోసం నిన్ను వదిలేటంత స్వార్థ పరుణ్ణి కాను. మా అమ్మ, నాన్నలు నన్ను చిన్నప్పటినుంచి యెంతో ప్రేమగా పెంచారు. ఎన్నడూ కసిరి కూడ ఎరగరు. వాళ్ళకి మన పెళ్ళి ఎలాగూ యిష్టం వుండదు. కానివాళ్ళని ఎక్కువ నొప్పించకుండా ఈ సమస్య లోంచి ఎలా బయటపడాలన్నదే పెద్ద సమస్య. కొంతవరకూ నాన్న నయం. ఈ పల్లెటూరిలోనే పుట్టి - పెరిగినా ఆయనలో అభ్యుదయ భావాలున్నాయి. ఒకసారి మా పాలేరు ఒకడికి వాళ్ళ పెద్దవాళ్ళు ఒప్పుకోపోయినా ఇద్దరూ యిష్టపడ్డారని ఆయన పెద్దరికం వహించి పెళ్ళిచేసారు. నాకు పెద్ద సమస్య అమ్మ. ఆవిడ పుట్టి పెరిగింది పరమ శ్రోత్రియ కుటుంబాల్లో. ఇంకో కులం వాళ్ళతో వియ్యమొందడం ఆవిడ దృష్టిలో పెద్ద పాపం. ఆవిడని ఎలా ఒప్పించగలం మన పెళ్ళికి. ఇంకో విషయం. ఈ పల్లెటూరి వాతావరణంలో పెరిగిన ఆడవాళ్ళకి తమ మాటని కాదంటే ఒక్కొక్కసారి ఏం చెయ్యగలరో నీకు తెలియంది కాదు. అవతలివాడి పట్టిన పట్టుకి ప్రతీకారంగా తమనే శిక్షించుకొంటారు. నూతుల్లో దూకడాలులాంటివి అరుదు కావు. అలాటిదేమయినా జరుగుతుందేమోనని నా భయం."

ఇంతలో గుర్నాధంగారు అక్కడికి వచ్చారు. ఇద్దర్నీ చూసి నవ్వి, విజయ కేసి తిరిగి అన్నారు. "ఏమమ్మా మా కోనసీమ పొలాలు ఎలా వున్నాయి"

విజయ నవ్వింది.

"మూడు బొండాలు తియ్యరా! నల్లయ్యా" అంటూ పాలేరుని కేకే

శారు గుర్నాథం.

"ఆ ఏతం దగ్గర ఒక ఫొటో తీసి కొని వస్తాను" అంటూ విజయ అక్కడ నుంచి వెళ్ళింది. ముగ్గురూ బొండాలు తాగిన తర్వాత -

"మీ అమ్మకి మీరిలా షికార్లు రావటం యిష్టం లేదు" అన్నారు గుర్నాథం విజయ కాస్త దూరం అవ్వగానే.

"నేను విజయని పెళ్ళి చేసుకోబోతున్నా" అన్నాడు సుబ్బారావు తల వంచుకొని.

గుర్నాథంగారు ఏమీ మాట్లాడ లేదు.

"విజయ చదువుకొన్నది. సంస్కారవంతురాలు. నాకు అన్నివిధాల నచ్చింది. నన్ను ప్రేమిస్తున్నది."

"ఇంతవరకు నీ మంచి చెడ్డలు చూసిన మేము, నీ పెళ్ళి విషయం సరిఅయిన నిర్ణయం తీసుకోమనా నీకు నువ్వే నిర్ణయించుకొన్నావు" అన్నారు గుర్నాధం బాధగా.

"నా ఉద్దేశం అదికాదు నాన్నా. విజయని తీసికొని రావడంలో ఉద్దేశం మీ అనుమతి తీసుకొందామనే. విజయ నాన్నగారికి కూడ ఈ పెళ్ళి యిష్టం లేదు. ఈ పెళ్ళి జరిగితే తన ఏభై ఎకరాల ఆస్థిలో ఒక్క పైసా కూడా దక్కదని విజయతో ఖండితంగా చెప్పారు. విజయ ఒక్కతే ఆయనకి సంతానం - చిన్నప్పుడే విజయ తల్లి పోయింది. నా కోసం విజయ అటు తండ్రిని, ఆస్థిని కూడా కాదంది."

"ఆయన బాధ నే నర్థం చేసుకో గలను" అన్నారు గుర్నాధం.

"పిల్లలు పెళ్ళి విషయంలో స్వంత నిర్ణయం చేసుకొంటే, అది ఏదో పెద్ద నేరంగా తల్లి దండ్రులు ఎందుకు భావిస్తారో నాకు అర్థం అవదు" అన్నాడు సుబ్బారావు బాధగా.

ఇంతలో విజయ తిరిగి వచ్చింది.

తండ్రి - కొడుకుల మొహాల్ని చూసి అర్థం చేసుకుంది.

వాళ్ళకి ఎదురుగా కూర్చొని, గుర్నాధంగారి కేసిచూస్తూఅంది నెమ్మదిగా. "ఆయన విషయం చెప్పిఉంటారు. మీనిర్ణయం ఏమిటి?". గుర్నాధంగారు ఒక క్షణం ఆలోచించి అన్నారు.

"మన సంఘంలో వివాహమనేది ఇద్దరు వ్యక్తుల మధ్య బంధమే కాదమ్మా, అది రెండు కుటుంబాల మధ్య బంధం. కష్టాల్లో, సుఖాల్లో ఆ రెండు కుటుంబాలూ ఒకరి కొకరు బాసటగా నిలవడానికి వివాహం ఒక పెద్దమెట్టు. అలాటి బంధాల బలమే మన హిందూ సంఘం ఇన్ని వేల సంవత్సరాలు నిలబడటానికి కారణం. నిన్ను చిన్నప్పటినుంచి ప్రేమతో పెంచి పెద్దచేసిన మీ నాన్నగారికి నీ వివాహం విషయంలో నిర్ణయం చేయడానికి, ఆదీ నీ సౌఖ్యమే మనసులో ఎంచి నిర్ణయించే బాధ్యత, అధికారం లేవంటావా."

"నన్ను అంత ప్రేమతో పెంచిన

మా నాన్న, నా సౌఖ్యాన్నే ఆశించిన మా నాన్న, నేను ఈ పెళ్ళివల్ల సుఖ పడానని తెలిసికూడ ఎందుకు ఒప్పు కోలేకపోయారు? నా బాధ్యత నేను చూసుకోలేని పసిపాపనని ఆయన ఉద్దేశమవ్వాలి. లేకపోతే నా వివాహ నిర్ణయాధికారం ఎప్పుడూ, తనదే అయివుండాలన్న పట్టుదల అవ్వాలి. నా భవిష్యత్తు నేనే సరిదిద్దుకోగల వయస్సు మన స్థైర్యం ఉన్నప్పుడు కూడా ఆయన నియంతృత్వవైఖరి చూపిస్తే నేను చెయ్యగలదేముంది. మీరే చెప్పండి" అంది విజయ, ఆయన కేసి సూటిగా చూస్తూ.

"నీ కోణంలో చూస్తే నీకు అలా అనిపించవచ్చు. కాని ఆయన కోణం లో చూడు ఈ సమస్య" అన్నారు గుర్నాధం.

"ఒక వ్యక్తి ఏదో ఒక కులంలో పుట్టినంత మాత్రాన జన్మతః ప్రత్యేక లక్షణాలు - మంచివి కాని, చెడువి కాని - వస్తాయా?" అని ప్రశ్నించింది విజయ.

గుర్నాధంగారు మాట్లాడలేదు.

విజయే మళ్ళా అంది. "మేము శాకాహారులం కూడా".

కాసేపు ఎవ్వరూ మాట్లాడలేదు. నిశ్శబ్దాన్ని భేదిస్తూ అంది విజయ "మా నాన్న పాత తరానికి చెందిన వాడు. ఆయన మా పెళ్ళికి ఒప్పు కుంటాడని నే నెప్పుడూ అనుకోలేదు. కనీసం మిమ్మల్నయినా ఒప్పించి, మీ ఆశీర్వాదం తీసుకుందామన్న ఆశతో వచ్చాం. అది కూడా కరువై నప్పుడు, యింతమందిని ఎదిరించి చేసుకున్న మా వివాహం శోభిస్తుందా అనిపిస్తోంది". అలా అంటూంటే విజయ కళ్ళలో కారు మేఘాలు క్రమ్మాయి. సుబ్బారావు 'ఉరుకో' అన్నట్టు చూసాడు విజయ వైపు. గుర్నాధంగారు ఒక్క క్షణం అలా శూన్యంలో చూసి, లేస్తూ "సరే! తోటంతా చూసి చీకటి పడకుండా తిరిగి వచ్చేయండి. పురుగూ, పుట్రా వుంటాయి" అంటూ అక్కడ నుంచి యింటివైపు మరలారు.

ఇంటికి వచ్చిన గుర్నాధంగార్ని చూసి కాంతమ్మ అంది -

"వాడేడి? వాడిని పంపమంటే మీరే తిరిగి వచ్చారే"

వాడితో నేను మాట్లాడాను"

"ఏమంటాడు?" అందికాంతమ్మ.

"వాళ్ళు పెళ్ళి చేసుకోబోతున్నారు"

కాంతమ్మ మొహం కోపంతో ఎర్ర బడిపోయింది.

నా కంఠంలో ప్రాణం ఉండగా అలా జరగడానికి వీల్లేదు. వాణ్ని రానీ యండి — వాడికి గడ్డి పెడ్తా. నవ మాసాలు మోసి, పెంచి పెద్దచేసింది వీడు యిలా కులాన్ని గంగలో కలప

డానికా ? ఊరిలో ఎంత అప్రతిష్ట. ఎటు చూసినా మచ్చలేని వంశంలో వీడెల నా కడుపున పడ్డాడో ఏ జన్మలో ఏ పాపం చేసానో భగవంతుడా" అంటూ ఏడ్వడం మొదలుపెట్టింది కాంతమ్మ.

"ఏమిటా ఏడ్పు. ఎవరైనా వింటే ఎవరో చచ్చిపోయారనుకొంటారు" అన్నారు గుర్నాధం కోపంగా.

"మీరేమీ గట్టిగా చెప్పలేదా" అంది కాంతమ్మ ఏడ్పు దిగమ్రింగుకుంటూ.

"చూడు కాంతం. మనం ఒక్క విషయం ఆలోచించాలి - రోజులు మారుతున్నాయి. మన పెళ్ళినాటి పరిసితులకి ఇప్పటి పరిస్థితులకి కొంత తేడా వుంది. వాళ్ళిద్దరూ పెద్ద చదువులు చదువుకొన్నవాళ్ళు. వాళ్ళ బాగోగులు వాళ్ళే చూసుకోగల వయస్సు, సంస్కారం ఉంది. ఒక్క విషయం చెప్తాను విను. మనకి తెలీకుండా వాళ్ళు పెళ్ళి చేసికొన్నా మనం చేసేదేమీ లేదు. వాళ్ళ నాన్నగార్ని ఎదిరించింది విజయ ఈ పెళ్ళికి. ఇప్పుడు మనం కూడా కాదంటే ముందర కొంత బాధపడ్డా, వాడు కూడా ఆ దారే త్రొక్కుతాడు. నష్టపోయేది మనం. వాడి మనస్సుకి ఎప్పుడూ వాడు జవాబు చెప్పుకోగలడు తానేమీ చెడ్డపని చేయలేదని. మన పట్ల వాడికి ప్రేమ, గౌరవం లేవని కూడ అనలేం. ఎందుకంటే ఈ వివాహానికి మన అనుమతి కోసం వచ్చాడు. మన పెద్దరికాన్ని మనం నిలుపుకొంటే చాలు" అన్నారు గుర్నాధం సమాధానపరచే ధోరణిలో.

"మీరు కూడా యిలా మాట్లాడతారేమిటి. ఊరులో ఎంత అప్రతిష్ట" అంది కాంతమ్మ కొంచెం కోపంగా.

"ఆ విషయంలో నీకేమీ భయం లేదు. దేవుడి దయవల్ల మనకింత ఆస్తి హోదా వున్నాయి, మనల్ని వెలివెయ్యగల స్థోమతు ఈ ఊళ్ళోకాని, మన బంధువుల్లో కాని ఏ కుటుంబానికి లేదు. ఆ పరిస్థితిని నేను చాలా సులభంగా ఎదుర్కొనగలను."

కాంతమ్మ మొహం కోపంతో వెలిగిపోతోంది.

"సరే ! మీరు కూడా వాళ్ళ పక్షంలో చేరిపోయారు. ఏమైనా నా యింట్లో యిలాటి వాళ్ళకు స్థానంలేదు. వాళ్ళు రాగానే చెప్తా. వెంటనే యింట్లోంచి పొమ్మని" అంది కాంతమ్మ. అంతవరకు శాంతంగా సమాధానపరచడానికి ప్రయత్నిస్తున్న గుర్నాధంగారికి కూడ కోపం వచ్చింది.

"ఈ యిల్లు నాది. ఇది నా కుటుంబం. ఇది నా కొడుకు సమస్య. నా యిష్టం వచ్చినట్టు జరగాల్సిందే" అన్నారు గుర్నాధం కోపంగా.

కాంతమ్మ ఒక్కసారి నివ్వెరపోయింది.

"సరే ! అంతవరకు వచ్చినప్పుడు నాకు మీ కుటుంబంతో సంబంధం

లేదు. ఏ గంగలో దిగుతారో దిగండి" అంటూ విసురుగా కొట్టు గదిలోకి పోయి గడియపెట్టుకొంది.

గుర్నాధంగారు వీధరుగుమీద కూల బడ్డారు తల పట్టుకొని.

ఓ గంట గడిచింది.

"అమ్మ ఏదీ" అన్న పిలుపుతో తెలివిలో కి వచ్చారు గుర్నాధం.

"కొట్టు గదిలో గడియ పెట్టుకొని కూచ్చుంది"

సుబ్బారావు అర్థం కాకుండా చూసాడు తండ్రికేసి. విజయ కూడా ఆందోళనకరంగా చూసింది.

"ఏముంది. మీ పెళ్ళి విషయం చెప్పాను. మీకు తెలుసుగా అలాటి వాళ్ళు ఈ విషయాన్ని ఎలా తీసి కొంటారో" అని కాసేపు ఆగి అన్నారు "ఒక విధంగా దాని అభి ప్రాయం సరిఅయినదే. అది పెరిగిన వాతావరణంలో అంతకన్నా ఆలోచించ లేదు. ఏం చేస్తాం" అన్నారు నిర్లిప్తంగా గుర్నాధం.

సుబ్బారావు ఆ గది తలుపు దగ్గ లకు వెళ్ళాడు.

"అమ్మా! తలుపు తియ్యి" అన్నాడు తలుపు కొడ్తూ.

లోపలినుంచి జవాబు రాలేదు.

"అమ్మా! ఏమిటిది. నేను సుబ్బా రావుని. తలుపు తియ్యి"

లోపలినుంచి యింకా జవాబు రాలేదు.

"అమ్మా! నీ ఒక్కగానొక్క ముద్దుల కొడుకుని. సుబ్బారావుని. తలుపు తియ్యి. ప్లీజ్."

ఒక క్షణం అయినతర్వాత గడియ తీసిన చప్పుడైంది.

మెల్లగా ఒక తలుపు తీసి అంది కాంతమ్మ కోపంగా.

"నీకు ఒక అమ్మ వుందని యింకా గుర్తుందా"

"నీతో వివరంగా మాట్లాడాలి. ఒక్కసారి బయటకురా"

"నువ్వు నాకేమీ చెప్పనక్కర్లేదు. ఇవ్వాల్టినుంచి నాకు ఎవ్వరూ పుట్ట లేదే అనుకొంటా" అంది కాంతమ్మ నిర్లిప్తంగా.

"నువ్వు అలా అనుకోగలవేమోగాని అమ్మా! నాకు అమ్మ లేదని మాత్రం నేను ఎప్పుడూ అనుకోలేను" అన్నాడు బాధగా సుబ్బారావు.

కాంతమ్మ మనస్సు ద్రవించి పోయింది.

"విజయని నేను" అంటూ సుబ్బా రావు ఏదో చెప్పబోతుంటే కాంతమ్మ వారించబోయింది.

"నన్ను పూర్తిగా చెప్పనీయ్ అమ్మా. తర్వాత నువ్వేమన్నా అను" అంటూ అక్కడే గడప యివతల కూర్చొన్నాడు. కాంతమ్మ అటువైపు తలుపును ఆనుకొని కూర్చొంది.

"నేను విజయను పెళ్ళిచేసుకోబో

తున్నాను. విజయ నాకు అన్నివిధాలా నచ్చింది. నేను విజయకీ నచ్చాను. ఒకర్నొకరం పూర్తిగా అర్థం చేసుకుని ఈ పెళ్ళికి యిష్టపడ్డాం. విజయ మన కులం కాకపోవచ్చు. కాని సంస్కారమనేది ఏ ఒక్క కులం సొత్తు కాదమ్మా. మేము నువ్వను కొనే విధంగా ఏ పాపం కాని, నేరం కాని చెయ్యడం లేదు. నిస్సంకోచంగా, నిర్భయంగా చేసికోబోతున్న వివాహం మాది, నువ్వు కాదనకమ్మా"

కాంతమ్మ ముభావంగా కూర్చొంది.

"నీ పట్టుదల కోసం నేను విజయని చేసికోపోయిన, ఈ జీవితంలో యింకెవర్నీ మాత్రం వివాహం చేసికోను. అలా అయితే నీ కిష్టమవుతుందా"

కాంతమ్మ ఏమీ మాట్టాడలేదు.

"చెప్పమ్మా !! నీ పట్టుదల కోసం నేను మనసారా కోరుకొన్న విజయని చేసికోకుండా ఆజన్మాంతం బ్రహ్మచారిగా, అసంతృప్తితో, ఒక విధంగా స్వార్థపరుణ్ని అనుకొంటూ జీవించనా ? ఎంతో ప్రేమతో పెంచిన తల్లి దండ్రులు నన్ను అర్థంచేసుకోలేదన్న బాధవున్నా. నీ మాట కాదని నా జీవితాన్ని ఆనందమయం చేసుకోనా ? నువ్వే చెప్పమ్మా" అన్నాడు సుబ్బారావు

కాంతమ్మ మౌనం విడవలేదు.

సుబ్బారావు ఒక్క క్షణం ఆగి అన్నాడు నెమ్మదిగా.

"ఈ విషయంలో మిమ్మల్ని ఎదిరిస్తున్నందుకు నేను ఎంత బాధ పడ్తున్నానో నీకు తెలియదమ్మా! నువ్వు నా గురించి ఏమనుకొంటున్నావో నేను ఊహించగలను. ఒక కుల భ్రష్టుడు, ఒక అప్రాచ్యుడు, ఒక కృతఘ్నుడు నా కడుపున ఎలా పుట్టాడా అని ఆలోచిస్తున్నావు కదూ. నేనూ, విజయ ఈ ప్రపంచంలో ఏం చెయ్యమన్నా చేస్తాం ఆ భావన తొలగించేందుకు. కాని నాకు తెలుసు మేము ఏమీ చెయ్యలేమని. అది మా దురదృష్టం. నీకు కొడుకు సుఖం కంటే, సంఘంలోని అర్థంలేని పరువు. ప్రతిష్టలే ముఖ్యమనుకొంటే, నీకు జీవితంలో తిరిగి మా ముఖాలు చూపించం. కాని మేము యెక్కడ వున్నా, మీ ఆయురారోగ్యాల కోసం ప్రార్థించని క్షణముండదు. నీ అనుమతి కోసం, ఆశీర్వాదం కోసం వచ్చాం. మమ్మల్ని దీవిస్తావో, శపిస్తావో ఆ పైన నీ దయ" అంటూ అక్కడినుంచి వీధి గదిలోకి వెళ్ళాడు సుబ్బారావు కళ్ళంబడి నీరు తుడుచుకుంటూ.

కాంతమ్మ అలాగే కూర్చొంది

అచేతనంగా.

కాసేపు అయిన తర్వాత విజయ, సుబ్బారావులతో గుర్నాథంగారు వచ్చి, కాంతమ్మతో అన్నారు.

"వీళ్ళిద్దరూ నీదగ్గర శలవు పుచ్చుకుందుకు వచ్చారు."

కాంతమ్మ దిగ్గున లేచి అంది.


"వాళ్ళకి లేకపోతే మీకైనా బుద్ధి లేదండీ. చీకట్లో ఇప్పుడు యెక్కడికి వెళ్తారు. రేపు ప్రొద్దున్న వర్జ్యం రాకుండా పంపిద్దాం" అంటూ వంట గదిలోకి వెళ్ళింది, వంట ప్రయత్నాలు చెయ్యడానికి.

ముగ్గురి మొహాల్లోనూ మందహాసాలు వెలిగాయి.

మర్నాడు ప్రొద్దున్న అందరూ కాఫీలు తాగారు.

వీధిలో జట్కాలో సామాను పెడుతున్నాడు సుబ్బారావు విజయని దగ్గరికి పిలుస్తూ అంది కాంతమ్మగారు.

"ఇక వాడి బాగోగులు నీ చేతిలోనే



పెడుతున్నాం. ఎలా చూస్తావో. వాడికి వంకాయ కారం పెట్టి కూరన్నా చల్ల పులుసన్నా ప్రాణం. వారానికి రెండుసార్లు అయినా చేస్తూ వుండు. వాడికి అసలే బద్ధకం. నువ్వయినా వారానికి ఓ ఉత్తరమైనా రాస్తూవుండు"

విజయ చిరునవ్వుతో తల వూపింది.

సామాను అంతా బండిలో సర్దిన తర్వాత విజయ, సుబ్బారావులు పెద్ద వాళ్ళిద్దరికీ నమస్కారం చేసారు. "పుత్రప్రాప్తిరస్తు" అన్నాడు గుర్నాథంగారు.

"పెళ్ళి రిజిస్ట్రీ అయిన తర్వాత ఉత్తరం రాయండి", అంది కాంతమ్మ కన్నీరు అపుకొంటూ.

విజయ, సుబ్బారావులు సంతృప్తితో జట్కా ఎక్కారు.

గుర్నాథంగారు వీధి మొగవరకు బండి వెనక నడిచి, వాళ్ళను వదుల్తూ అన్నారు.

"మీ పెళ్ళి అదిజరపకపోయి నాదాని ఆశీర్వాదం లభించింది. అదే చాలు. అలాటి ఆశీర్వాదాలే మన ప్రగతికి సోపానాలు"

విజయ, సుబ్బారావుల కళ్ళు కృతజ్ఞతతో చెమర్చగా, గుర్నాథంగారు దూరమయ్యారు.

బండి ముందుకు సాగిపోతోంది.

●□●